కార్యక్రమం అయిపోవస్తుంది-ప్రజలనుండి నినాదాలు వచ్చాయి-కసితోకూడిన కంఠాలు అగ్నిలామండాయి చిన్న పిల్లలు సైతం పిడికిలెత్తి లేత కంఠాలతో వినదిస్తున్నారు.

వాళ్ళ వర్గకసిని చూస్తుంటే చారుమజుందార్ నిర్వచించిన భూమిలేనిరైతుకూలీల నుండి 'నూతన మానవుడు' ఉద్భవిస్తాడన్న విషయం నిజమేననిపించింది.

వాళ్ళ చైతన్యాన్ని, ఉత్తేజాన్ని చూస్తుంటే, మావో అన్నట్లు సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు పూర్తిగా నశించేకాలమిది. కార్మికులు రైతుకూలీలు పూర్తిగ తమరాజ్యం స్థాపించుకునే కాలమిదిఅని-

మినీ కథ :

# తీర్పు

రెడ్‌సన్

వెంకట్రావుడికాయేల మాసెడ్డ సిరాగ్గావుంది. 'ఎన్నాల్లీకష్టం' అని అనుకున్నాడు. మొదట్నించీ సింవ్వాద్రినాయుడంటే తనకి బయంవున్నా ఆ బయ్యంఎనక వాడిమీద కసి వుందని వాడే చాలాసార్లొప్పుకున్నాడు.

చెల్లెలిపెండ్లికి చేసిన రెండొందల అప్పుకింద తాళ్ళపక్క మెట్టపొలం రాయించుకున్నప్పుడూ, జీతంరాళ్ళు అప్పుడోపదీ ఇప్పుడోపరకా ఇచ్చి ఇంకా నీకిచ్చేదేటని పెద్ద మొత్తం ఎగేసినపుడూ, గుడిసెబాగు చేసుక్కునేందుకు అడవిలోంచి తెచ్చుకున్న ఏకు మొద్దులు మంచి మాటల్తో కాజేసి తనమిద్దె కట్టుకోడానికి ఉపయోగించుకున్నప్పుడూ, ఇంకా చాలా సార్లప్పుడూ సింవ్వాద్రినాయుడిమీద తనకు పగే కలిగిందితప్ప మరేం లేదని వాడు తనలో తాను చాలాసార్లనుకున్నాడు. కానీ వాన్ని నేనేటి సెయ్యగల్ను? పెద్దింటి లంజికొడుకుల కెదురేటుంటాది? అనుకున్నాడు. కానీ మళ్లీ అన్నేటోటి సెయ్యకుండా వుండలేను అనుకున్నాడు. మరయితే ఏంచేద్దామని? మొన్నెక్కడో ఇట్టగే కష్టాలింకపడలేనుగాక పడలేనని కాసింత బూ(వి కౌలుకుతీసుకుని విత్తనాలేసేడు. అది బాగాఎదిగి కోతకొచ్చింది. తరుణంలో విత్తనాలేసిందగ్గర్నించీ రాత్తుర్లు, పగళ్ళనక కావలాకాసేడు. పిట్టనికూడావాలనీకుండా కాపాడేడు. ఇంకో రెండ్రోజుల్లో కోతలు మొదలుపెట్టిద్దామనుకున్నాడు. ఆ ధాన్యంతో యీయేడు సజావుగా సాగుద్దని మురిసిపోయేడు. దానిమీదెన్నో ఆశలుపెట్టుకున్నాడు. ఇల్లు బాగుచేసుకుందా-మనుకున్నాడు. కొత్త బట్టలు కొందామనుకున్నాడు. సరిగ్గా ఆ సమయంలోనే సింవ్వాద్రినాయుడు దిగేడు. తానెప్పుడో యిచ్చిన అప్పు మిగిలిందంటూ లెక్కలూ్చపేడు. ఆ అప్పెక్కడిదో,

ఎప్పుడు తీసుకున్నాడో తనకి అర్థంగాకపోయినా అప్పుతీసుకున్నట్టు సాక్ష్యాలు చెప్పించేడు. తానీ అప్పు తీసుకోలేదన్నాడు— దొంగ అప్పులు పుట్టించడం న్యాయంకాదన్నాడు— కనికరించమన్నాడు— ఇంకా అనాల్సినవన్నీ అన్నాడు బతిలాడేడు— అయినా వాడు విన్లేదు— ససేమిరా వీల్లేదన్నాడు— అప్పిచ్చితీరాలన్నాడు— లేపోతే బాకీ కిందకి పంట తీసేసుకుంటానన్నాడు. అలా అనేయడం, వారివెంట వచ్చిన మనుషులు పంట కోసీడం జరగడం అయిపోయింది— అప్పుడు వెంకట్రావుడికి దుఃఖంరాలే— నెల రోజులకింద సోంపేట రైతులు భూస్వామిని అడ్డంగా నరికీసి వాడి భూముల్ని పంటల్ని లాక్కోడం గుర్తొచ్చింది. ఆ తరవాత వాడు రెండ్రోజుల్దాకా కన్పించలే— ఆ తర్వాత సింవ్వాద్రినాయుడు శవం వాడిముంగిట్లోనే రెండుముక్కలై కన్పించింది— ఆ తరవాత ఆ ప్రాంతంలో అట్లాటి సింవ్వాద్రినాయుళ్ళ శవాలు రెండు ముక్కలై చాలాసార్లు కన్పించేయి.

## ప్రజాసాహిత్యం – పాట

వర్గీస్

ప్రజలు-కళలు: అంటే; విశేషప్రజా బాహుళ్యం. ప్రజల సమస్త సాహిత్యం-కళలు. ప్రజల వునికిని పరిశీలిద్దామా ? లేదు ! ప్రస్తుతం కళలగురించి మాత్రమే చర్చిస్తున్నాం కాబట్టి ప్రజాజీవితంతో ముడిపడి ఉన్న కళలను మాత్రమే చర్చిద్దాం. సాంస్కృతిక రంగంలో పనిచేస్తున్న మన కామ్రేడ్స్ ఐన రచయితలు, కళాకారులు సృష్టించిన కళలగురించిగాని సాహిత్యం గురించిగాని చర్చించడంకూడ ఈ వ్యాసం ఉద్దేశంకాదు. ప్రజలు—ప్రజల కళలు, అందునా సమస్త ప్రజాకళలలో ప్రాముఖ్యం వహించే ప్రజల పాట గురించి చర్చించడం మాత్రమే ఈ వ్యాసంయొక్క పరిధి. ఇది దృష్టిలో ఉంచుకొని ఈ వ్యాసాన్ని చదువవలసిందిగా కోరుతున్నాను.

పాట ఎలాపుట్టింది? ప్రజలు పాటలు ఎందుకు పాడుకుంటారు? ఇది సమస్త శ్రమజీవుల జీవితాలల్లో ఎందుకు ముఖ్యపాత్ర వహిస్తుంది? నేడు ఈ రకమైన కళా రూపాల గురించి ఇంత తీవ్రమైన చర్చలు జరపడం ఎందుచేత?—ఇవన్నీ ప్రశ్నలయితె సమాధానాలు కూడ గొలుసులా ఒకదానికి మరొకటి సంబంధం ఉండే వస్తాయి.

'పాట ఎలాపుట్టింది?' అన్న సమస్యనే తీసుకున్నప్పుడు ప్రజల సామాజిక జీవితాన్ని మినహాయించి దీన్ని ఊహించలేము. అందుచేత ప్రజల జీవితాలలో, సంఘర్షణలలో కష్టసుఖాలలో భాగంగానే దీన్ని చూడాలి. అప్పుడేకాని మనం సరైన నిర్ణయాలకు రాలేము.